క్లుప్తంగా

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపికలు

టేకులపల్లి: హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో నాలుగో తరగతిలో ప్రవేశాలకు మండల స్థాయిలో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ ఠాకూర్ రాంసింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25న బాలురకు, 26న బాలికలకు ఉదయం 9 గంటల నుంచి టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. ఎనిమిది సంవత్సరాల వయస్సు లోపు ఉన్న బాలబాలికలు అర్హులని తెలిపారు. వివరాలకు 9491543004 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

జూలై 7న చలో వరంగల్

టేకులపల్లి: ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మరియు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో జూలై 7న వరంగల్‌లో జరగనున్న మాదిగల ఆత్మీయ కవాతుని జయప్రదం చేయాలని జిల్లా కన్వీనర్ నల్లగట్ల వెంకన్న పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం టేకులపల్లిలో జరిగిన అత్యవసర సమావేశంలో మాట్లాడారు. 1994 జులై 7న మొదలైన ఉద్యమం 2024 జులై 7న 30 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంలో మాదిగల ఆత్మీయ కవాతును విజయవంతం చేయడానికి జిల్లాలోని అన్ని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలి రావాలన్నారు.

స్విమ్మింగ్‌పూల్‌ను పరిశీలించిన జీఎం

కొత్తగూడెంఅర్బన్(సింగరేణి): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధి గౌతంపూర్‌లోని స్విమ్మింగ్ పూల్‌ను శనివారం జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు పరిశీలించారు. ఇటీవల సివిల్, ఎలక్ట్రికల్ మరమ్మతులు చేపట్టడంతో పరిశీలించిన ఆయన స్విమ్మింగ్‌పూల్‌లో చెత్తా చెదారం పడకుండా మెష్ ఏర్పాటుచేయాలని సూచించారు. అధికారులు కోటిరెడ్డి, బి.శివకేశవరావు, అనిల్, ఎండీ.రజాక్ పాల్గొన్నారు.

టీపీసీసీ లేబర్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా 'సాధం'

పాల్వంచ: జిల్లా కాంగ్రెస్ పార్టీ లేబర్ సెల్ అధ్యక్షుడిగా సాధం రామకృష్ణారావు నియామకమయ్యారు. శనివారం హైదరాబాద్ గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో టీపీసీసీ లేబర్ సెల్ చైర్మన్ ఆర్.ప్రకాశ్‌గౌడ్ నియామక ఉత్తర్వులను రామకృష్ణారావుకు అందించారు. ఈ సందర్భంగా సాధం మాట్లాడుతూ... ప్రకాశ్ గౌడ్‌కు, జీహెచ్‌ఎంసీ లేబర్ సెల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వీరేందర్‌గౌడ్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంజిరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఏఐటీయూసీ జిల్లా మహాసభ

జూలూరుపాడు: ఆదివారం సారపాకలో జరగనున్న ఏఐటీయూసీ 2వ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి పోగుల కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా మహాసభ విజయవంతం కోసం శనివారం జూలూరుపాడులో ఆయన విస్తృతంగా ప్రచారం చేశారు.

'నీట్'పై సమగ్ర విచారణ జరిపించండి..

టేకులపల్లి: నీట్ పరీక్షను రద్దు చేయవద్దని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ హరిలాల్ నాయక్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం విలేకరులతో మాట్లాడారు.. నీట్ 2024 పరీక్షలో లీకులు జరిగినట్టుగా ఆధారాలు లేనందున పరీక్షను రద్దు చేయకుండా, ఎక్కడ పేపర్ లీక్ అయిందో అక్కడే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనేక మంది పేద తల్లిదండ్రులు కష్టపడి గంపెడాశలతో వారి పిల్లలకు మంచి భవిష్యత్ ఉంటుందని కోచింగ్‌లు ఇప్పించినట్లు చెప్పారు. ఇప్పుడు తప్పు చేయని విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఎవరో కొంతమంది అక్రమాలకు పాల్పడితే అందరినీ శిక్షించడం సరికాదన్నారు.

ఆన్‌లైన్ చెల్లింపుల హవా..

మీరు బయటికి వెళ్తున్నారా.. చేతిలో సరిపడా నగదు లేకపోయినా ఫర్వాలేదు.. అకౌంట్‌లో సరైన నగదు, చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు.. మార్కెట్లో కావాల్సిన వస్తువులు కొనుగోలు చేయొచ్చు... బజారులో నచ్చినవన్నీ తినొచ్చు. గతంలో మాల్స్, పెద్ద వ్యాపార సంస్థలకే పరిమితమైన డిజిటల్ పేమెంట్స్ రానురాను చిరువ్యాపారుల చెంతకు సైతం చేరాయి. నగదు లావాదేవీలు తగ్గుతుండటంతో పెద్ద మార్కెట్ల నుంచి గల్లీ మార్కెట్ల వరకు ఎక్కడ చూసినా ఆన్‌లైన్ చెల్లింపుల జోరే కనిపిస్తోంది.

- మార్కెట్లో డిజిటల్ పేమెంట్ల జోరు
- ఆన్‌లైన్ విధానంపై ఆసక్తి
- చిల్లర ఇబ్బందులకు చెక్

సండే స్పెషల్


జ్యూస్ బండి వద్ద ఫోన్ పే చేస్తున్న వినియోగదారుడు

చుంచుపల్లి: 2016లో పెద్దనోట్ల రద్దు తర్వాత ఆర్థిక లావాదేవీల్లో ఇబ్బందులను అధిగమించేందుకు డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించినా అప్పట్లో పెద్దగా ప్రజలు ఆసక్తి చూపించలేదు. రూ.500, రూ.2000 నోట్లు మార్కెట్లలో చెలామణి కావడంతో చిల్లర సమస్య వచ్చింది. నాటి నుంచి మాల్స్, పెద్ద వ్యాపార సంస్థల్లో మాత్రమే పేమెంట్ యాప్‌లు, క్రెడిట్, డెబిట్, కార్డులతో చెల్లింపులు జరిగేవి. నగదు వేరే వారి ఖాతాల్లోకి వెళ్లిపోతుందన్న ఆపోహలు, ఆర్థిక మోసాలు జరుగుతాయన్న ఆందోళనతో గ్రామాల్లో వీటి జాడ పెద్దగా కనిపించేది కాదు. పట్టణాల్లో మాత్రమే కొద్దిగా కనిపించేది. కోవిడ్ అనంతర పరిణామాలతో నగదు రహిత లావాదేవీల్లో ఊహించని మార్పులొచ్చాయి. టీ స్టాళ్లు, కాకా హోటళ్లు, తోపుడుబళ్లు, సైకిళ్లపై తిరుగుతూ ఫాస్ట్ ఫుడ్స్, కూరగాయలు, పండ్లు వంటివి అమ్మే వ్యాపారులకు ఈ ఆన్‌లైన్ చెల్లింపులు ప్రయోజనకరంగా మారాయి. ప్రధానంగా చిల్లర సమస్యతో వీరికి బేరాలు పోతుంటాయి. డిజిటల్ పేమెంట్స్ పుణ్యమా అని చిల్లర సమస్య తీరుతుండటంతో చిరువ్యాపారులు సైతం వీటివైపు మొగ్గు చూపుతున్నారు. పేమెంట్ యాప్‌లకు సంబంధించిన క్యూ ఆర్ కోడ్లను ఆయా సంస్థల ఏజెంట్లు క్షణాల్లో అందజేస్తున్నారు. ఇప్పుడు ఏ దుకాణం వద్ద చూసినా క్యూ ఆర్ కోడ్ స్టిక్కర్ల బోర్డులు దర్శనమిస్తున్నాయి. గతంతో పోలిస్తే చాలా వరకు వినియోగదారులు ఆన్‌లైన్ పేమెంట్ చేసేందుకే ఆసక్తి చూపిస్తున్నారని, వీటివల్ల చిల్లర సమస్య ఉండటం లేదని వ్యాపారులు అంటున్నారు.

భారీగా పెరిగిన డిజిటల్ లావాదేవీలు...

ఫోన్-పే, గూగుల్-పే, పేటీఎం, అమెజాన్ -పే, భారత్ -పే వంటి యాప్‌లతో అన్నిచోట్లా ఆన్‌లైన్ సేవలు విపరీతంగా పెరిగాయి. కిరాణా, ఫ్యాన్సీ, మందులు, పెట్రోల్ బంకులు, సెలూన్ షాపులు, హోటళ్లు, మిఠాయి దుకాణాలు, ఇతర నిత్యావసర వస్తువుల దుకాణాలతో పాటు మొబైల్, డీటీహెచ్ రీచార్జిలు, విద్యుత్, గ్యాస్ బిల్లులు, ఇతర ఆర్థిక లావాదేవీలు చాలా వరకు ఈ యాప్‌ల ద్వారానే జరుగుతున్నాయి. పేమెంట్ యాప్‌లు వినియోగిస్తున్న వారిలో యువత ముందు వరుసలో ఉంటోందని తేలింది. ఆన్‌లైన్ చెల్లింపులో ఉపయోగాలతో పాటు ఆదమరిస్తే మోసాలకు అంతే ఆస్కారం ఉంటుందని నిపుణులు అంటున్నారు. వీటిపై అవగాహన లేని వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని మాయగాళ్లు మోసాలకు పాల్పడుతుంటారు. సరుకులు కొనుగోలు చేసిన తర్వాత వేరే వారికి నగదు బదిలీ చేస్తారు. సెల్‌ఫోన్ స్క్రీన్‌పై వచ్చిన ట్రాన్సాక్షన్ సక్సెస్‌ఫుల్ మెసేజ్‌ను దుకాణదారుడికే అమౌంట్‌ను పే చేసినట్లు చూపించి అక్కడి నుంచి వెళ్లిపోతుంటారు. అయితే మార్కెట్లోకి వచ్చిన క్యూఆర్ కోడ్ స్పీకర్ బాక్సులు ఇటువంటి అక్రమాలకు చెక్ పెడుతున్నాయి. ఆన్‌లైన్ చెల్లింపు జరగ్గానే ఎంత మొత్తం దుకాణదారు ఖాతాకు జమ అయిందనే విషయం స్పీకర్‌లో బయటికి వాయిస్ రూపంలో వినిపిస్తుంది. దీంతో డిజిటల్ మోసాలకు అడ్డుకట్ట పడిందని పలువురు వ్యాపారులు అంటున్నారు. అటు డిజిటల్ పేమెంట్స్ చేసేటప్పుడు వినియోగదారులు కొన్ని జాగ్రత్తలు పాటించాలని నిపుణులు


మీసేవాలో ఆన్‌లైన్ స్కానర్

సూచిస్తున్నారు. నగదు పంపేందుకు మాత్రమే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాలి. రిసీవ్‌కు స్కాన్ అవసరం లేదు. యూపీఐ పిన్ ఎవరికీ చెప్పొద్దు. మీరు పేమెంట్ చేసేటప్పుడు మాత్రమే పిన్ ఎంటర్ చేయాలి. కొత్త నంబర్లు క్యూఆర్ కోడ్లకు నగదు పంపే ముందు అక్కడ వచ్చిన పేరు వారిదేనా కాదా చెక్ చేయాలి. అపరిచితుల నుంచి ఆఫర్ల పేరిట వచ్చే లింక్‌లను క్లిక్ చేయవద్దు. ఫోన్లు హ్యాక్ అయ్యే వీలున్నందున వాటిలో బ్యాంకింగ్ వివరాలు సేవ్ చేయవద్దంటున్నారు.

చిల్లర సమస్య లేదు..



నగదు లావాదేవీల వల్ల తరుచూ చిల్లర సమస్య అధికంగా ఉండేది. చిల్లర కోసం బేరాలు కూడా వదులుపనే వాళ్లం. ఫోన్ పే, గూగుల్ పే, క్యూ ఆర్ కోడ్‌లతో చిల్లర సమస్య లేకుండా వ్యాపారాలు సాఫీగా చేస్తున్నాం. మాకు సమయం కూడా ఆదా అవుతోంది. అన్ని ప్రాంతాల్లో డిజిటల్ చెల్లింపులు జోరుగా సాగుతున్నాయి. ప్రతీ చిన్న షాపులో క్యూ ఆర్ కోడ్‌లు అందుబాటులో ఉన్నాయి.

– బర్కతుల్లా, కూరగాయల వ్యాపారి

ఉమ్మడి జిల్లా ప్రజలు బీజేపీని ఆదరించారు..


మాట్లాడుతున్న వినోద్‌రావు, రంగాకిరణ్

చుంచుపల్లి: ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో అసలు బీజేపీకి ఉనికే లేదన్న వారికి గుణపాఠం చెప్పేలా 1.20 లక్షలకుపైగా ఓట్లు వేసి అండగా నిలిచి ప్రజలు ఆదరించారని ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన తాండ్ర వినోద్ రావు అన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రంగాకిరణ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో మాట్లాడారు. నరేంద్ర మోదీ చరిష్మా, పార్టీ పట్ల అభిమానం ఉన్న ప్రజలు ఎక్కువ సంఖ్యలో ఓట్లు వేశారని తెలిపారు. ఇదే స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారంలో అండగా ఉండాలని నిర్ణయించామని తెలిపారు. కొత్తగూడెం ఏరియాలో ఎయిర్‌పోర్టు విషయంపై సంబంధిత మంత్రులతో చర్చించటం జరిగిందని, దాన్ని సాధించటమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. రాబోయే జెడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు, నాయకుల సహకారంతో ఎక్కువ స్థానాలు గెలిచేలా పార్టీ బలోపేతం అయ్యేలా పనిచేస్తామని తెలిపారు. గొడుగు శ్రీధర్, రాయుడు నాగేశ్వరరావు, గాంధీ పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించండి


మాట్లాడుతున్న యాకూబ్‌షావలీ

ఇల్లెందు: మున్సిపల్ కార్మికులకు పనిభారం తగ్గించడంతోపాటు వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాకూబ్‌షావలీ డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై శనివారం కార్యాలయం ఎదుట ధర్నా చేసి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కమిషనర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గడిచిన మూడు నెలలుగా ఆదివారం కూడా పనులు చేయించుకోవడం, స్పెషల్ డ్రైవ్ పేరుతో రెండు పూటలా పనులు చేయించడం సరికాదన్నారు. విశ్రాంతి లేకుండా పనులు చేయించుకుంటున్న అధికారులు సకాలంలో వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. ప్రస్తుతం ఒక్కో కార్మికుడికి రూ.40వేల వేతనం రూపంలో చెల్లించాల్సి ఉందన్నారు. 23 నెలలుగా వేతనంలో కోత విధిస్తున్న అధికారులు ఆ సొమ్మును పీఎఫ్ ఖాతాలో జమచేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈఎస్ఐ చెల్లింపులు కూడా చేపట్టడం లేదన్నారు. ప్రస్తుతం పాఠశాలలు ప్రారంభమైనందున కార్మికుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, శ్రీను, నాయిని కృష్ణ, వెంకటేశ్వర్లు, సంజీవ, ఉమ, భూలక్ష్మి, సంధ్య, ఎల్లాబాయి, కలాం, వరలక్ష్మి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నలుగురిపై కేసు నమోదు

పాల్వంచరూరల్: చేనులో చెట్లు ఎందుకు నరికారు అని అడిగినందుకు చంపుతామని బెదిరించిన నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు... బస్వతారక కాలనీకి చెందిన బానోతు వీరునాయక్ తన చేనులోని చెట్లను ఈనెల 19న నరికారు. ఈ విషయమై బానోతు రమేష్, రాజు, సాయిచంద్, అరుణలను అడిగినందుకు తనతో గొడవపడి చంపుతామని బెదిరించారని శనివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం...

జూలూరుపాడు: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి కాపర్ వైర్ అపహరించిన సంఘటనపై స్థానిక పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు.

ఏఎస్ ఐ బి.తిరుపతిరావు తెలిపిన వివరాలు... ఈ నెల 15న వినోబానగర్, మొద్దులగూడెం, పడమటనర్సాపురం, కాకర్ల గ్రామాల్లో వ్యవసాయ పొలాల్లోని నాలుగు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తుతెలియని వ్యక్తులు పగలగొట్టి కాపర్ చోరీ చేశారు. విద్యుత్‌శాఖ లైన్‌మెన్ నల్లగట్ల భాస్కర్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో మేకలు మృతి

ఇల్లెందురూరల్: విజయలక్ష్మీనగర్‌లో శనివారం విద్యుదాఘాతానికి గురై రెండు మేకలు మృతి చెందాయి. తిలక్‌నగర్‌కు చెందిన మహేష్‌కు చెందిన మేకలు అడవికి వెళ్లి తిరిగి వస్తుండగా విద్యుత్ స్తంభానికి తగలడంతో షాక్‌కు గురై మృతి చెందాయి. వెంటనే స్థానికులు స్తంభానికి చుట్టూ ముళ్ల కంచెను ఏర్పాటు చేశారు. రూ.30 వేలు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

భార్యాభర్తలపై దాడి

కొత్తగూడెంఅర్బన్(పాల్వంచ): పాత కక్షల నేపథ్యంలో భార్యభర్తలపై ఓ వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం పట్టణంలోని కేఎస్‌ఎం బంక్ వద్ద దాబా హోటల్ నడుపుతున్న గుగులోతు రాములు తన ఇంటి ముందు ఆగి ఉన్న కారు డ్రైవర్‌తో మాట్లాడుతున్నాడు. ఈ సమయంలో పక్క దాబా హోటల్ వ్యక్తి యుగంధర్ పాత కక్షల నేపధ్యంలో రాములను తిట్టాడు. గొడ్డలి కర్రతో మొఖంపై కొట్టాడు. దీంతో తీవ్రగాయం అయింది. ఇంతలో అక్కడికి భార్య ఝాన్సీ రాగా ఆమెను కూడా తిట్టి దాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు ఝాన్సీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో యుగంధర్‌పై కేసు నమోద్ చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.రాము తెలిపారు.

సింగరేణి ప్రైవేటీకరణను అడ్డుకుంటాం..


కొత్తగూడెంఅర్బన్(సింగరేణి): కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కొత్తగూడెం అర్బన్(సింగరేణి): సింగరేణి ప్రైవేటీకరణకు బీజేపి, కాంగ్రెస్ పార్టీలు చేస్తున్న యత్నాలను అడ్డుకుంటామని టీజీబీకేఎస్ ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ తెలిపారు. కొత్తగూడెంలోని యూనియన్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ... బీజేపీ, కాంగ్రెస్ కలిసి సింగరేణిపై కుట్ర పన్నాయని ఆరోపించారు. సీఎంగా కేసీఆర్ ఉన్నప్పుడు కోయగూడెం, శ్రావణపల్లి, సత్తుపల్లి, కల్యాణఖని ఓసీలు ప్రైవేట్ కాకుండా కేంద్రంపై ఒత్తిడి తెచ్చారన్నారు. ఈ సమావేశంలో రీజియన్ కార్యదర్శి కూసన వీరభద్రయ్య, గడప రాజయ్య, కిరణ్, విజయ్‌కుమార్, ఎం.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు బ్లాక్‌లు సింగరేణికి కేటాయించండి..

తెలంగాణలోకి బొగ్గు బ్లాక్‌లను వేలం వేయకుండా సింగరేణికే కేటాయించాలని బీఎంఎస్ నాయకులు కోరారు. ఈ సందర్భంగా వారు హైదరాబాద్‌లో శనివారం కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. బొగ్గు బ్లాక్‌లను వేలం వేస్తే సింగరేణి మనుగడకు ముప్పు ఉన్నందున చొరవ తీసుకోవాలని కోరారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలైన ట్రాన్స్‌కో, జెన్‌కో నుంచి రావాల్సిన రూ.29 వేల కోట్లు ఇప్పించాలని, అవసరమైన చోట సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల ఏర్పాటుకు చొరవ చూపాలని, కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు చేసి కార్మికుల పిల్లలకు నాణ్యమైన విద్య అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో పి.మాధవనాయక్, యాదగిరి సత్తయ్య, పవన్‌కుమార్, ఎం.రమాకాంత్, పులి రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, సింగరేణిలో ఉద్యోగ విరమణ చేసిన వారికి 2017 నుండి గ్రాట్యుటీ చెల్లించి కుటుంబాలను ఆదుకోవాలని గాంధీపథం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు చింతల చెర్వుగోర్వం శనివారం కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో... బొగ్గు గనుల ప్రైవేటీకరణ నిలిపివేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... గనుల వేలాన్ని నిలిపివేసి తెలంగాణలోని గనులను సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్‌లో ప్రస్తావించాలన్నారు.

కార్యక్రమంలో మందా నర్సింహారావు, ఏజే రమేష్, వీరన్న, సూరం అయిలయ్య, విజయగిరి శ్రీనివాస్, గాజుల రాజారావు, శ్యాంకుమార్, ప్రభాకర్, రమణభాస్కర్, కొత్తపల్లి రమేష్‌బాబు, సమ్మయ్య, నాజర్ పాల్గొన్నారు.

కొత్తగూడెంఅర్బన్(పాల్వంచ): దేశంలోని అర్హై బొగ్గుబావులను ప్రైవేటీకరించడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వేలం ప్రక్రియను వ్యతిరేకించాలని, అందుకు అన్నిరంగాల కార్మికులు ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దొడ్డా రవికుమార్, పట్టణ కార్యదర్శి కె.సత్య అన్నారు. బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా శనివారం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్మికులు గట్టయ్య, మహేశ్, సాయి, శ్రీను, సామేలు తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడలపై దృష్టి సారించాలి


ఒలింపిక్ రన్ ప్రారంభిస్తున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందు: యువత క్రీడలపై దృష్టి సారించాలని డీఎస్పీ చంద్రభాను పిలుపునిచ్చారు. శనివారం ఇల్లెందుకు చేరుకున్న ఒలింపిక్ క్రీడా జ్యోతిని క్రీడాకారులు డీఎస్పీకి అందజేశారు. స్థానిక క్రీడాకారులతోపాటు ఆయన సింగరేణి హైస్కూల్ నుంచి ఒలింపిక్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొత్తగూడెం ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఒలింపిక్ డే సందర్భంగా ఈనెల 20న దమ్మపేటలో ప్రారంభమైన క్రీడా జ్యోతి 21న భద్రాచలం మీదుగా 22న ఉదయం ఇల్లెందు చేరుకుందని గుర్తుచేశారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు.

తద్వారా నేరాల సంఖ్య కూడా గణనీయంగా తగ్గుతుందన్నారు. పోలీసు డిపార్ట్‌మెంట్‌లో క్రీడాకారులకు మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ఒలింపిక్‌లో పతకాల సాధనలో మన దేశం వెనకబడి ఉంటోందని, క్రీడాకారులు దేశ ఖ్యాతి ఇనుమడింపజేసేలా క్రీడలలో సాధన చేసి అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీఐ బత్తుల సత్యనారాయణ, జాతీయ బాస్కెట్‌బాల్ క్రీడాకారిణి సుమిత్ కోరి, అథ్లెటిక్ కోచ్ నాగేందర్, క్రీడాకారులు సుదర్శన్‌కోరి, రాజేష్, శ్రీకాంత్, అఖిల, సునిత కోరి, మహీధర్ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘం అధ్యక్షుడిగా భిక్షం


భిక్షంను సన్మానిస్తున్న డైరెక్టర్లు

జూలూరుపాడు: స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడిగా చీమలపాటి భిక్షం శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం పీఏసీఎస్ అధ్యక్షుడిగా లేళ్ల వెంకటరెడ్డి కొనసాగుతున్నారు. అయితే వెంకటరెడ్డి అధ్యక్ష పదవిని సవాల్ చేస్తూ సొసైటీ డైరెక్టర్లు హైకోర్టును ఆశ్రయించారు. ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్, సీడ్స్ పేరిట లైసెన్స్ ఉన్నాడని అధ్యక్ష పదవికి అనర్హుడని, అదేవిధంగా డైరెక్టర్‌ను కూడా డిస్‌క్వాలిఫై చేస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ మేరకు వైస్ చైర్మన్ భిక్షంను అధ్యక్షుడిగా నియమించారు. శనివారం స్థానిక సొసైటీ కార్యాలయంలో డైరెక్టర్లతో సీఈఓ సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన సొసైటీ చైర్మన్‌ను డైరెక్టర్లు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు యల్లంకి సత్యనారాయణ, కొమ్మినేని పాండురంగారావు, చాపలమడుగు రామ్మూర్తి, లకావత్ హేమ్లా, పాపిన్ని వెంకయ్య, రెడ్డిబోయిన రాము, ఎం.తిరువెంగళరాజు, కళ్లోజి రజనీ, జవహర్‌లాల్ పాల్గొన్నారు.

'మధ్యాహ్న' పెండింగ్ బిల్లులు చెల్లించండి


ఇల్లెందురూరల్: ఎంఈఓ పిల్లి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న భోజన వర్కర్లు


టేకులపల్లి: ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ఇల్లెందురూరల్: మధ్యాహ్న భోజన వర్కర్లకు పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో వర్కర్లు శనివారం ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈఓ పిల్లి శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన వర్కర్ల సంఘం జిల్లా కార్యదర్శి సుల్తానా, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నబీ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచార సమయంలో కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీ ప్రకారం భోజన వర్కర్లకు రూ.10వేలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతోపాటు చార్జీలు పెంచాలని, కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని, రాగి జావ కాయడానికి గ్యాస్ సరఫరా చేయాలని కోరారు. తదితర డిమాండ్ల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 24న జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నా చేస్తామన్నారు. ఆ రోజున పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండబోమని, విద్యార్థులు ఇంటి నుంచే టిఫిన్ బాక్స్‌లు తెచ్చుకునేలా ప్రధానోపాధ్యాయులు అప్రమత్తం చేయాలని కోరారు. కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, ఐలమ్మ, కనకమ్మ, మీరా, కౌసల్య, యాదమ్మ, సరిత, జయ, సుభద్ర, వీరమ్మ, సమ్మక్క, సుజాత, ప్రమీల పాల్గొన్నారు.

టేకులపల్లి: మధ్యాహ్న భోజనం వర్కర్ల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మిక యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా టేకులపల్లి మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాగలక్ష్మి, జయ, పాపమ్మ, మంగి, అచ్చి, బుల్లి, సోన, విజయ భారతి, సుజాత, భారతి పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా



హేమచంద్రాపురం వద్ద ముర్రేడు వాగులో ఇసుక కుప్పలు

- జేసీబీలతో ఇసుక తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు

కొత్తగూడెంరూరల్: ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రాపురం ప్రాంతానికి చెందిన ఒక రాజకీయ నాయకుడు ఏకంగా జేసీబీలతో ముర్రేడు వాగులో ఇసుక కుప్పలు ఏర్పాటు చేస్తున్నారు. అనంతరం వాటిని ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నాడు. అధికారుల అండదండలు ఉన్నాయని చెప్పుకుంటూ రూ.లక్షలు వెనకేసుకుంటున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రాపురం ముర్రేడువాగు, అనిశెట్టిపల్లి, లోతువాగు, చాతకొండ, సాటివారిగూడెం, కారుకొండ తదితర పంచాయతీ, అశోక్‌నగర్‌లోని మామిడితోట కాలనీలో సైతం ఇదే పరిస్థితులు ఉన్నాయి. వాగులో నుంచి నిత్యం, పగలు, రాత్రి ఇసుక అక్రమంగా తరలిపోతోంది. ఒక్కో ట్రాక్టర్ ఇసుకనే 3 – 4 వేల రూపాయల వరకు విక్రయిస్తున్నారు. కొత్తగూడెం పట్టణం, మండలంలో ఇల్లు నిర్మించుకునే వారి అవసరాన్ని బట్టి ఇసుక రేటు పెరుగుతుంది. అత్యవసరం అయితే ఒక ధర... మాములుగా అయితే మరో ధరతో ఇసుక రవాణా చేస్తున్నారు. అయినా పోలీసు, రెవెన్యూ అధికారులు పట్టించుకోవటం లేదు. కొంతమంది ఇసుక అక్రమ వ్యాపారులు అధికారులకు నెలనెలా మామూళ్లు ముట్టజెప్తుతూ జేబులు నింపుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. అధికారులు అమ్యామ్యాల మత్తులో ఉండడంతో ఇసుక అక్రమార్కులు మూడు పువ్వులు ఆరుకాయలుగా ఇసుక వ్యాపారం చేస్తున్నారని స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు. చాతకొండ, అనిశెట్టిపల్లి, మామిడితోట (అశోక్‌నగర్), హేమచంద్రాపురం వాగులో ఎడ్లబండ్లతో ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. ఒక్కో ఎండ్లబండి ఇసుక రూ.800 – 1000 చొప్పున రోజుకు నాలుగు బండ్ల ఇసుకను అమ్ముకుంటున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. లక్ష్మీదేవిపల్లి మండలంలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంతో పోలీసు, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ఇసుక అక్రమ దందాను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.


ఎడ్ల బండితో ఇసుక తరలిస్తున్న దృశ్యం

చర్యలు తీసుకుంటాం..



లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలో ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాం. వారి పేరు గోప్యంగా ఉంచుతాము. నిఘా ఏర్పాటు చేస్తాం.

– రమణారెడ్డి, ఎస్ఐ, లక్ష్మీదేవిపల్లి